ఇది ఆంధ్రదేశం. అందుకే సుందరమ్మగారు చేతులు తిప్పుకుంటూ వచ్చి- “నాయనా నువ్వు మా అల్లుడి స్నేహితుడివే కావచ్చు కాని - ఆ అబ్బాయి వచ్చినప్పుడు కూడారా- అంతే కానీ పరాయి వాడి పెళ్ళాన్ని చూడ్డానికి తగుదునమ్మా అంటూ వచ్చేవా; మాదేమి అలగా కుటుంబం కాదు. వెళ్ళు; వెళ్ళు; నీకు తెలీదేమోకాని. అలా మా అమ్మాయిని పేరెట్టి పిలిచి చూస్తారమ్మంటే నీ ఎదురుగుండా వచ్చి నిలబడుతుందనుకున్నావా? సిగ్గు సిగ్గు;” అని తలుపులు భళ్ళున వేసుగుందిట మొహం మీద.

ఈ స్టోరీ అంతా చి॥సౌ॥ వెంకటసత్యవతి మొగుడే నాకు చెప్పి నన్ను తెగ నవ్వించేడు.

నిజమేఁ హాస్యనటుడు అందర్నీ నవ్విస్తుంటే అతగాడి భార్య పరోక్షంగా మిమ్మల్ని ఏడిపించడం జాలి కథే. చార్లీ చాప్లిన్ తీసే హాస్యనటుడి స్నేహితుడి జాలి కథలా వుంది.

అందుకా మీరు “సుందరమ్మ వీథి” అంటే మండిపడతారు? పాపం - వెరీ సారీ అండి;

# డబ్బు ఖర్చు రైల్వే

డబ్బు ఖర్చు రయిల్వే ధర్మమా అని అరకు వేలీలో అయిదేళ్ళు అరణ్య వాసం అజ్ఞాత వాసం చేశాము. అక్కడ పళ్ళు తెగ తినొచ్చని పాలు ప్రవహిస్తాయనీ బేవార్సుగా లైఫ్ ఈజీగా గెటాన్ కావచ్చనీ, పరుగులెత్తుకు వచ్చినవాళ్ళు పూర్‌మేన్స్ ఊటీలో దోస్ తిన్నారు. అయితే అరకు వేలీపేరు చెప్పగానే చింతపండూ చీపురుకట్టలూ. పనస పళ్లూ - పొట్టి సెట్టి, బాబూరావు కిల్లీ కొట్టు త్రినాధు పెసరట్టు పంతులు హోటలూ - చచ్చిపోయినతాసీల్దారు గారూ, ఎప్పుడూ కుంటుకుంటూ తిన్నగా నడవని “కోపరేటి బస్సు - ఎక్కడా ఆగని రాందాసూ. డాక్ రన్నరు మరియూ మాజీ పోలీసు కనిస్టేబు సాంబమూర్తీ పేషంట్లను పేషన్స్ లేకుండా బండబూతులు తిట్టిచందాలు పోగుచేసి శ్రీనివాసుడికి గుడి కట్టించిన పులి మీసాల పెద్ద డాక్టరూ. స్మశానం పక్కనే వున్న ఆసుపత్రిలో డ్రామాపోర్షన్ కంఠతాపట్టే డ్రెస్సరూ అరివీర భయంకరుడు అజగాంకరుడు, ఆవుకన్నా సాధువైన ఆవుల రామిరెడ్డి గారూ, అరవంకంటె తెలుగు బాగా వచ్చినా అరవ పితలాటకాలుపెట్టందే ప్రాణం ఒప్పని హమేషా బ్లడ్ ప్లెషరు కృష్ణన్, ఎందరి తలల్లోనో నాలుకలా తిరిగే మీ ప్రియ శిష్యుడు మీరు చెప్పని వన్నీ స్టేజీమీద చేసి చూపించే పొట్టి పంతులూ, ఎన్నెన్నో స్మృతులు దొంతరలు దొంతరలుగా వచ్చి మనసును తట్టి లేపుతాయి.

ఆ అడవి ఊళ్ళో మీరో చిన్నసైజు హీరో-అందుకే అక్కడ వున్న నాలుగైదేళ్ళూ మీరాడింది ఆటా-పాడింది పాటా; మీ చిట్టి చిట్టి అలకలూ పొట్టి పొట్టి కోపాలూ తీర్చలేక శతమతమై పోయేవారు మీ గేంగు.

అన్నిట్లోనూ తల దూర్చడం - నా బొందో అని చాకిరీ చేయడం మీకు ఆనవాయితీ అయిపోయింది.

ఆనక అందరితో తగూలాడ్డం పేచీకోరని పేరు మూట కట్టుకోవడం మీకు మామూలే.

మొదట్లో మనం రెండు టెంట్లు వేసుకుని అందులో వుండే వాళ్ళం (Camp fire) మంటలు వేసుకుని చుట్టూ కుర్చీలు వేసుకుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. ఎదురు గుండా బ్రహ్మాండమైన లోయ - ఇటూ అటూ పర్వత రాజపుత్రికలలా పరుగెత్తే సెలయేళ్ళు... అక్కడికి పులులు నీళ్ళు త్రాగడానికి వస్తాయనేవారు నిజమేనాండి? చిరుతపులి అడుగులు చూపించే వాళ్లు మన టెంటువెనుక - హడలిచచ్చిపోయే దాన్ని. పప్పువుంటే ఉప్పుదొరికేది కాదు. ఉప్పు ఉంటే పప్పుదొరికేది కాదు. ఏదో ఒక వస్తువు లేకుండా గడుపుకు పోవాల్సివచ్చేది. పలకరించేందుకు ఎవరూ వుండే వాళ్ళు కారు. టెంటు బయట కుర్చీవేసుకుని ఆలోయలోకి చూస్తు గంటలకు గంటలు గడిపేసేదాన్ని. అక్కడే బల్ల వేసుకుని మీరూ నేనూ పిల్లలూ భోజనాలు చేసే వాళ్ళం. ఆ బల్లమీద కొండల కేసి చూస్తూ సెలయేళ్ళ చప్పుళ్ళు వింటూ పేకాడుకునే వాళ్ళం.

కొప్పులో ఎర్రటి మందారపూలు తురుముకొని, వీపుమీద ముడివేసుకుని చుట్టబెట్టుకున్న జిలుగు జలతారు వన్నెచిన్నెల చీరలతో సారా సేవించి, ఒకరు మంట దగ్గర డమరూ వాయిస్తూంటే లయ బద్ధంగా తాళగతి తప్పకుండా అడుగులు వేస్తూ తమ మగవాళ్ళతో చేయిచేయి కలిపి సిగ్గు బిడియాలు లేకుండా చెట్టాపట్టా లేసుకుని వలయాకారంగా తిరుగుతూ "ధిమ్సా డాన్స్" చేస్తుంటే గతంలోకి ఎక్కడికో విసిరేసి నట్లనిపించేది. ఏ యుగంలో జీవిస్తున్నామో తెలిసేది కాదు నాకు.

ఆ ఆకుపచ్చ సిరా ఒలక పోసినట్లున్న అడవిలో పచ్చని మైదానాలలో ఆ కొండల నేపథ్యంలో జలపాతాల చప్పుళ్ళు వింటూ బండరాలతోనూ నీళ్ళతోనూ చక్కగా పెనవేసుకు పోయిన వారి జీవితాలను చూస్తోంటే వాళ్ళను ప్రకృతి ఒడిలోనుంచి విడదీసే ప్రయత్నాలు చేసే మన గవర్మెంటును తల్చుకుంటే పిచ్చికోపం వచ్చేది నాకు. వాళ్ళు చదువు కోవాలిట? మనకు మల్లే వాళ్లు కావాలనుకోవడం కంటె దౌర్భాగ్యం వుంటుందా? మనం వారికంటె ఎక్కువ అనుకుని వాళ్ళను బాగు చేయాలను కోవడం అపరాధం అంటాను నేను. మన జీవితాలలో లేనిది హరించి పోయినదేదో వెతుక్కుంటే వారిలో మనకు దొరుకుతుంది.

అరకువేలీలో వున్నది గవర్మెంటు జాతి మనుష్యులూ దుకాణాల వాళ్ళూ. ప్రకృతిలో గాఢంగా పెనవేసుకుపోయిన జీవితాలు గడిపే కొండవాళ్లు. ఈ ఆదిమ నివాసుల కొండల గుండెలు పగల గొట్టి - అరణ్యాలు నరికి, చదును చేసి మీ డబ్బు ఖర్చు రైల్వేవాళ్ళు వంతెనలు సొరంగాలు, స్టేషనులూ ఇళ్ళూ కట్టి లైను వేశారు. ఆ భీషణ ప్రకృతిని చీల్చుకుంటూ మీ ఇనుప పట్టాలు కిరండల్ దాకా వెళ్ళేయి. కాకిరాయి తెచ్చేరైళ్ళు చకచక పరుగులెత్త సాగేయి. ఈ నవ రైల్వే నిర్మాణం వలన ఈకొండవాళ్ళకు డబ్బు విలువ బాగా తెలిసివచ్చింది.

ఇప్పుడు వాళ్ళు ప్రకృతి ఒడిలో అమాయకంగా నిద్రించే భూమాత బిడ్డలుకారు. పట్నం

పోయి సినిమాలు చూసొస్తున్నారు. టెర్లిన్లుకొని డ్రస్సులు వేసుకొంటున్నారు. ట్రాన్సిస్టర్లు కొంటున్నారు. ఆ ఆదిమ వాసుల సంఘ జీవితంలో డబ్బు ప్రవేశించింది – మన తాలూకు కుళ్ళు కూడా వెంటనే చేరింది, అవును – నిజమే వాళ్ళను మనంత వాళ్ళను చేసికాని మనం వదలం అని దృఢ ప్రతిజ్ఞ చేశాం కదా!

అన్నట్టు అరకులో వుండగా పెరట్లో పెద్ద కూతురిలా నిలువెత్తు పెంచిన మన గులాబిచెట్టు, ఇప్పుడు ఎవరి దొడ్లో పూలూ పూస్తోందో?

గోడ మూల నక్కినట్లు పొంచి దొంగ చూపులు చూసే మందార మొక్కను ఎవరూ పీకి పారెయ్యలేదుకదా; దాని పక్కనే వేశాను చిన్న మల్లి పందరి – ఎవరూ నీళ్ళు పోయకపోతే బెంగటిల్లి అది ఎండి పోయిందేమో... ఆఫీసు ఎదురు గుండా వేసిన యూకలిప్టస్ చెట్లు ఈ పాటికి ఎంత ఎత్తు ఎదిగి ఉంటాయి చెప్మా... రోకలి బండలా చప్పుడు చేసుకుంటూ వచ్చే రైలు దాని పరుగులిడే చక్రాలకు అట్టడుగునించి ప్రవహించే జీవితవాహిని ఎన్నడైనా గుర్తుంటుందా?

అరకు రైల్వేస్టేషన్లో బండి ఆగి బయల్దేరే ముందు కూత వేసినపుడు – అది మీ కందరికీ జయ జయ ధ్వానాలు తెలుపుతోందని గ్రహించాలి;

ఆ సొరంగాల గుండా ప్రయాణం చేసే రైల్లో సుఖంగా కూర్చున్న పెద్ద మనుష్యులు వారు అలా సౌకర్యంగా ప్రయాణం చేయడం కోసం కష్టపడిన ఎన్నో వేలమంది మీబోటివాళ్ళు ఆ రైలు ఎక్కకుండానే తలవంచుకుని సెలవంటూ తమతమ సెలవులకి వెళ్ళి పోయారని గుర్తుంచుకుంటే చాలు;

కాని తీరికూర్చుని ఎవరు సుఖమైన వేళల్లో కష్టజీవుల్ని జ్ఞాపకం చేసుకుంటారు? చేసుకోకూడదు. దరిద్రులమీంచి కష్టజీవుల మీంచి డబ్బుఖర్చు రైల్వేవాళ్లు రైలును నడిపించేస్తారు.

సుఖపడేవాళ్ళు, కాకాగాళ్ళూ రైల్లో కూర్చుని ప్రయాణాలు చేస్తారు.

తెలివితక్కువ వాళ్ళు దాని నిర్మాణంలో పని చేస్తారు. అందుకే మిమ్మల్నెవరూ చిన్న సైజు హీరో అయినా రైలెక్కండి రండి అని పిలవలేదు. అరకువేలీ మిమ్మల్ని మర్చిపోయింది.

సో వెరీసారీ అండీ.

# రంగుల డేరా

"జూ"లో కటకటాల వెనుక జంతువుల్ని చూస్తూంటే కట కటా ఇష్టంలేకుండా కాపరాల కెళ్ళిన అమ్మాయిలు గుర్తుకొస్తారు నాకు.

అహ; సర్కస్‌లో అలాక్కాదు.

బ్యాండు వాయిస్తోంటే, టికెట్టు కొన్న అన్ని వేల జతల కళ్ళ ముందు అర్ధనగ్నంగా తొడలాగులు, బాడీలు వేసుకుని రబ్బరు బంతుల్లా ఎగురు కుంటూ గంతులు వేసే ఆడపిల్లలు –